ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 18.08.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సామాజిక సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అందరికీ ఆదర్శప్రాయుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు.
2. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ప్రెస్ సేవా పోర్టల్ గురించి ప్రచురణ కర్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా యోగేష్ బవేజా అన్నారు.
3. ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకులు కె. నాగరత్న తెలిపారు.

------------------------

**CM – SARDHAR PAPANNA GOUD**

18వ శతాబ్దపు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నేడు రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఆయన సాగించిన పోరాటానికి నిదర్శనంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సామాజిక సమానత్వం, బహుజనులకు రాజ్యాధికారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆదర్శప్రాయుడని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న

గౌడ్ జయంతి వేడుకలను జనగామ, సిరిసిల్ల, వనపర్తి, సంగారెడ్డి, వరంగల్ తో పాటుగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు.

**(DESK & PTC s)**

---------------------

**RNI**

పత్రికలు, వార మాస పత్రికలు నమోదు ప్రక్రియలో వచ్చిన మార్పుల పట్ల ప్రచురణకర్తలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర సమాచార ప్రసార శాఖ, పత్రికా సమాచార కార్యాలయం హైదరాబాద్ లో ఈ ఉదయం ప్రత్యేక వార్తాలాప్ నిర్వహించింది. ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా యోగేష్ బవేజా మాట్లాడుతూ, కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ప్రెస్ సేవా పోర్టల్ గురించి ప్రచురణ కర్తలకు ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. 1867 నాటి ప్రెస్ రిజిస్ట్రేషన్ అండ్ బుక్స్ యాక్టు రద్దైన తర్వాత, గత ఏడాది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ఆఫ్ పీరియాడికల్స్ చట్టం అమలులోకి రావటంతో ప్రచురణల నమోదు ప్రక్రియ సులభతరం అయినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రెస్ సేవా పోర్టల్ లో సులభంగా, ఒకే దరఖాస్తు ద్వారా పూర్తవుతుందని చెప్పారు.

**(Soundbyte - Baweja)**

సంయుక్త సంచాలకులు ఆసుతోష్ మోహ్లె మాట్లాడుతూ, పోర్టల్ వెసలుబాటును వివరించారు. పత్రికా సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ శృతీ పాటిల్, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**(MSL)**

------------------------

**SITHAKKA**

ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. మంగపేట , ఏటూరు నాగారం తాడ్వాయి ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఫ్లడ్ మేనేజ్మెంట్ కమిటీలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు , వంకల

ప్రవాహం ఎక్కువగా ఉంటే బయటకు రావద్దని, భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించే అవకాశాలు ఉన్నందున ప్రజలు స్వీయ రక్షణలో ఉండాలని మంత్రి సీతక్క కోరారు.

**(DESK)**

---------------------

**SRIDHARBABU**

కృత్రిమ మేథ డిజిటల్ పరివర్తన విజేతలు కార్యక్రమం " పేరిట జూబ్లీ హిల్స్ MCHRD లో నిర్వహిస్తున్న మూడు రోజుల కార్యశాలను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులకు కార్యశాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**(DESK)**

---------------------

**SABITHA INDRA REDDY**

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా ఇంద్రారెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

**(DESK)**

---------------------

**RAINS**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకులు కె. నాగరత్న తెలిపారు. ఆదిలాబాద్, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరుస్తాయని వెల్లడించారు. కాగా హైదరాబాద్

లో రాత్రంతా వర్షం కురిసింది. జగిత్యాల, ఖమ్మం, నాగర్ కర్నూల్, వనపర్తి, కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట తదితర జిల్లాల్లో వర్షాలు కరుస్తున్నాయి. గడచిన 12 గంటల్లో సిద్దిపేట జిల్లా గౌరారంలో అత్యధికంగా 23 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

**(Desk)**

------------------------

**ADD TO RAINS**

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉత్తర ఆంధ్రప్రదేశ్ – దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల వద్ద, పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం నిలకడగా ఉన్న అల్పపీడనం వచ్చే 12 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి దక్షిణ ఒడిశా – ఉత్తర ఆంధ్రప్రదేశ్ సమీపంలో రేపు ఉదయానికి తీరందాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

**(MSL)**

----------------------

**RESERVOIRS**

రాష్ట్రంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా,గోదావరి పరవాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టులు జలకళ సందరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అనేక ప్రాంతాల్లో పంట నీట మునిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రహదారులు ధ్వంసమయ్యాయి. నాగార్జునసాగర్, సింగూర్, శ్రీరాంసాగర్, కౌలాస్ నాలా, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల నుండి నీటిని కిందికి వదులుతున్నారు. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం సమీపంలో మంజీరా నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.హైదరాబాద్ చుట్టు పక్కల, మహబూబ్ నగర్, గద్వాల్, రంగా రెడ్డి, సంగా రెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాలలో వాగులు, చెరువులు, నదులకు ఓ మోస్తరు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందంటూ హెచ్చరికలు జారీ

చేశారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయిందని అధికారులు ప్రకటించారు.

**DESK&PTCs**

-------------------

**SIRCILLA**

వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వ రాయితీపై పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల వ్యవసాయాధికారి దుర్గరాజు కోరారు. ఆయన ఈ రోజు ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ...5 ఎకరాలలోపు సాగు భూములున్న సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ, మహిళ రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందించనున్నట్లు తెలిపారు.

**బైట్...వ్యవసాయాధికారి దుర్గరాజు**

**(PTC)**

----------------------

**SIDDIPET – COLLECTOR VISIT**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. సెలవులను రద్దు చేసినందున వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు హాజరై రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అంబేద్కర్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు.

**(PTC)**

----------------------------

**ASIFABAD**

భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్బంగా ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పర్వతారోహకుడు జిట్టే కార్తీక్, అతని బృందం హిమాచల్ ప్రదేశ్ లో 6 వేల మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ కానామో శిఖరాన్ని అధిరోహించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు

ఎదురైనప్పటికీ, విజయవంతంగా శిఖరాన్ని అధిరోహించగలిగామని జిట్టే కార్తీక్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆర్థిక సహాయంతో పర్వతారోహణం చేసినట్లు పేర్కొన్నారు.

**(PTC)**

-----------------------

**RAINS IN MULUGU**

ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఏటూరు నాగారంలో మూడు గంటల్లోనే 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు జిల్లాలోని జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. పలు చోట్ల రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. బొగత జలపాతం వీక్షించేందుకు అనుమతిస్తున్నామని, నీటిలోకి దిగే అవకాశం ఇవ్వడం లేదని అధికారులు తెలిపారు.

**(DESK)**

----------------------------------

**ELECTRIC SHOCK**

హైదరాబాద్ రామంతాపూర్‌లో అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గోకుల్ నగర్ లో నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి తొమ్మిది మంది విద్యుదాఘాతానికి గురయ్యారు. అందులో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కరెంట్ షాక్ తో ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారుల్ని ఆదేశించారు

**(desk & PTC MEDCHAL).**

------------------------